

శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



భిన్న సాంస్కృతిక వేషధారణల్లో చిన్నారులు

ఘనంగా బాలల దినోత్సవం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని గ్రామాల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుష్మలత, టీచర్ శ్రీలత చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

రాక్‌వుడ్స్ స్కూల్‌లో కల్చరల్ డే

పోచారం: యంనంపేట్‌లోని రాక్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన కల్చరల్ పనోరమా కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. వైవిధ్యభరితమైన అంశాలను విద్యార్థులు అభినందనీయంగా ప్రదర్శించారు. అదే విధంగా టీచర్లు కూడా సాంస్కృతిక ప్రదర్శనలు చేసి విద్యార్థులకు వినోదం పంచారు. కార్యక్రమంలో అతిథులుగా స్కూల్ సీఈఓ సుబ్రహ్మణ్యం రంగినేని, ప్రిన్సిపాల్ దివ్యా శర్మ, హెచ్‌ఎం రంజని పాల్గొన్నారు. సృజనాత్మకత, అంకితభావాలను మేళవించి ఆద్యంతం ఆహ్లాదభరితంగా కార్యక్రమాన్ని కొనసాగించిన విద్యార్థులను, టీచర్లను వారు అభినందించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలి

కీసర: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించే విధంగా పట్టుదలతో ముందుకెళ్లాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన స్వయం పాలనా దినోత్సవం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ఉన్నత స్థాయిలో ఎంతో మంది ఉన్నారని వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్ కాలనీలో బాలల దినోత్సవంలో మేయర్ శాంతి

గో ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ జయశంకర్‌నగర్‌లో గురువారం గో ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ శాంతి హాజరై మాట్లాడుతూ.. గో ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్యూషన్లు, ఉచిత భోజనం, వైద్య శిబిరాలు ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, ట్రస్ట్ డైరెక్టర్ మేరీ ప్రిసిల్లి, కిరణ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.


బాలల దినోత్సవ వేడుకల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుష్మలత

పశువుల తరలింపును అడ్డుకున్న పోలీసులు

ఘట్‌కేసర్: క్రూరంగా పశువులను తరలిస్తున్న వారిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బైపాస్ చౌరస్తాలో గురువారం వేకువజామున తనిఖీల్లో భాగంగా వరంగల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఐచర్ (టీఎస్07–యూఎం 5419) వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో గాలి ఆడని విధంగా, ఆహారం కూడా వేయకుండా, కదలకుండా తాళ్లతో క్రూరంగా బంధించి తరలిస్తున్న 38 ఆవులతో కలిపి 73 పశువులు ఉన్నాయి. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా వాహనం యజమాని ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్ హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తేలింది. వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకొని వాటిని జియాగూడలోని కామధేను గోశాలకు తరలించారు. పశువులను క్రూరంగా హింసిస్తూ తరలిస్తున్న డ్రైవర్ ప్రమోద్, వాహనం యజమాని షాన్‌వాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



శామీర్‌పేట్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ అన్నారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్సార్ చౌరస్తా, అలియాబాద్ చౌరస్తాల వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో 56 వాహనాలను తనిఖీ చేయగా, 13 వాహన యజమానులకు జరిమాన విధించి, సరైన పత్రాలు లేని 5 వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ శ్రీనాథ్ తెలిపారు. అనంతరం వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. ఎస్సైలు హారిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతులు కల్పించాలి

అల్వాల్: యాప్రాల్‌లోని శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ గౌడ సంఘం నాయకులు గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే శ్మశానవాటికలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గౌడ సంఘం అధ్యక్షులు వెంకటస్వామి, నరసింహ, మురళి, రాజేష్, చందర్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, రాముగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డితో గౌడసంఘం నాయకులు

ఉచిత కంటి వైద్య శిబిరం

అల్వాల్: కార్తీకమాసం సందర్భంగా అల్వాల్ రాంనగర్‌లోని సాయిబాబా దేవాలయం ఆవరణలో ఐ ల్యాండ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఐ ల్యాండ్ ఆసుపత్రి నిర్వాహకులు కృష్ణకాంత్, అరవింద్, అర్చకులు శ్రీధర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

అల్వాల్: అల్వాల్ డివిజన్ ముత్యంరెడ్డినగర్‌లో గురువారం కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. కాలనీలోని పార్కును పరిశీలించి సుందరీకరణ పనులు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. పార్కుల్లో చిన్నారుల ఆట సామగ్రిని ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంటలోని లాల్‌బహదూర్ శాస్త్రి సామాజిక భవనం వీధిలో భూగర్భడ్రైనేజీ, సీసీరోడ్డు వేయాలని కోరుతూ కాలనీవాసులు గురువారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ డ్రైనేజీ, సీసీరోడ్డు వేయిస్తామని కాలనీవాసులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. వాసుదేవరావు, నవీన్, వేణు, రఘు, పూర్ణచందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ సూర్యానగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్ రెడ్డి స్థానిక కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూర్యనగర్ కాలనీలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. జలమండలి అధికారులు నిత్యం పనులను పరిశీలించాలని సూచించారు.

బాలిక అదృశ్యం

ఉప్పల్: బాలిక అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ వెంకటరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన వినోద్ ఆటో డ్రైవర్. కాగా ఆయన కుమార్తె (17) ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వికారాబాద్ కలెక్టర్‌పై దాడికి నిరసనగా ఆందోళన



సాక్షి, సిటీ బ్యూరో: వికారాబాద్ కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడికి నిరసనగా టీజీఈ జేఏసీ పిలుపు మేరకు గురువారం మేడ్చల్ కలెక్టరేట్‌లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానం లాంటి వారని, ఉద్యోగులకు వ్యక్తిగత ఎజెండా ఏమీ ఉండదన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించడం, ప్రజలకు తెలియజేయడం మాత్రమే వారి విధిగా భావిస్తారన్నారు. అలాంటి వారి మీద దాడి చేయటం అమానుషమన్నారు. దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో టీజీఓ జనరల్ సెక్రటరీ డాక్టర్ కురుమూర్తి, వైస్ ప్రెసిడెంట్ విజయ్ కుమారి, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, జేఏసీ ప్రతినిధులు, ఉద్యోగస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అఖిల భారత సహకార వారోత్సవాలు





కీసర: అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కీసర కార్యాలయంలో చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా సహకార పతాక ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు, కామసాని మల్లారెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, ధర్మనాయక్, సుశీల, మల్లేష్‌యాదవ్, సీ.ఈ.ఓ కృష్ణారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్‌లో..

శామీర్‌పేట్: అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అధ్యక్షతన శామీర్‌పేటలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ.. భూమిని నమ్ముకొని దేశానికి అన్నం పెట్టే రైతన్నకు మనమందరం ఋణపడి ఉండాలన్నారు. షుగర్ ఎగుమతుల్లో మొదటి స్థానంలో భారతదేశం ఉందని, ఇందుకు సహకార సంఘాలు ఎంత గొప్పగా పని చేస్తున్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింహులు యాదవ్, ఎండి అన్నపూర్ణ, రిజిస్ట్రార్ సురేఖ రాణి, ప్రసాద్, వివిధ సహకార సంఘాల అధ్యక్షుడు, డైరెక్టర్లు, మహిళా కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

వీధిదీపాల ఏర్పాటుతో సమస్యల పరిష్కారం

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లే అవుట్‌లో వీధిలైట్ల ఏర్పాటుకు రూ. 34 లక్షల నిధులను మంజూరు చేసిన జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి కార్పొరేటర్ తీసుకురాగా నిధులను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో మరమ్మతులు, ఎల్‌ఈడీ లైట్లు, విరిగిన స్తంభాల పునరుద్ధరణ, కేబుల్స్ ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరించనున్నట్లు కార్పొరేటర్ వివరించారు.


జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఆలస్యమైతే పరీక్షకు అనుమతించేది లేదు

ఘట్‌కేసర్: పరీక్ష కేంద్రాన్ని ముందు రోజే చూసుకొని పరీక్షరోజు గంట ముందే చేరుకోవాలని, పరీక్షకు ఆలస్యమైతే అనుమతి ఇచ్చేది లేదని కీసర ఆర్డీఓ సైదులు అన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్న గ్రూపు–3 పరీక్షకు మున్సిపాలిటీలోని ఏసీఈ కళాశాలలో ఏర్పాటు చేసిన 3 పరీక్ష కేంద్రాలను గురువారం పరిశీలించారు. అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 115 కేంద్రాలు, మున్సిపాలిటీలో 16 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పరీక్షలు సజావుగా జరిపేందుకు డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు, కోఆర్డినేటర్లు, రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేందర్, రీజనల్ కోఆర్డినేటర్ శర్మ, బయోమెట్రిక్ ఇన్‌చార్జి ఆఫీసర్ అశోక్, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి మల్లేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


ఏసీఈ కళాశాలలో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ సైదులు

గ్రూపు-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–3 రాత పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి, పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్లో ఏర్పాటు చేసిన టీజీపీఎస్సీ గ్రూప్–3 రాత పరీక్ష పై సమీక్షా సమావేశానికి డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ.. ఛీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్లు, డిపార్టెమెంట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు వారి వారికి కేటాయించిన విధులను సమయపాలన పాటిస్తూ, ఏలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ప్రతి ఒక అంశము నియమ నిబంధనల ప్రకారం చేయాలని, మీకు కేటాయించినంత వరకు మాత్రమే మీరు మీ విధులను నిర్వహించాలని అదనపు కలెక్టరు సూచించారు. ఛీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షా కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందరితో సమన్వయం చేసుకుంటూ గ్రూప్–3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. భద్రత పోలీసుశాఖ వారితో, నిరంతరాయ విద్యుత్తు, త్రాగునీరు, అదనపు బస్సులు సంబంధిత శాఖల అధికారులతో కోఆర్డినేట్ చేసుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ఒకరోజు ముందుగానే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను పరిశీలించుకోవాలన్నారు. పరీక్షా సెంటర్లలో రూట్ మ్యాప్‌లు, సైన్ బోర్డ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి వాటిని సరిగ్గా ఉన్నాయా లేదా అని పరిశీలించాలని సూచించారు. ఈ పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న అధికారులందరి సెల్ ఫోన్లను పరీక్షా కేంద్రాలలోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు వారి నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.



నేడు డయల్ యువర్ డీఎం

మేడ్చల్: ప్రయాణీకుల సలహాలు, సూచనలు, సమస్యలు తెలుసుకునేందుకు నేడు మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం సుధాకర్ తెలిపారు. సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు 9959226152 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ప్రయాణీకులు తమ సమస్యలను, సలహాలను ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

ఆస్ట్రేలియాలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి


ఆస్ట్రేలియా ప్రతినిధులతో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: వ్యాపార పనుల నిమిత్తం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. ఆదేశంలో పలు విద్యాసంస్థలను, విద్యావేత్తలను, ప్రభుత్వ పెద్దలను కలిసి వివిధ అంశాలపై ఆయన చర్చలు చేస్తున్నారు. ఆస్ట్రేలియాలోని విక్టోరియా పార్లమెంట్‌లో విక్టోరియస్ మంత్రులు అన్వర్‌ఎడ్గోయన్, నాటలి హచిన్సన్‌లతో సమావేశమయ్యారు. నైపుణ్య లోటును తీర్చేందుకు మల్లారెడ్డి అందించే సహకారంపై చర్చించారు. డెంటల్, నర్సింగ్, నిర్మాణం వంటి రంగాల నిపుణులతో సమావేశం అయ్యారు. మల్లారెడ్డి వెంట ఎక్సెల్ గ్లోబల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు


ఘనాపూర్‌లో నెహ్రూ జయంతి వేడుకల్లో మహేష్‌గౌడ్

ఘట్‌కేసర్: భారత తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ఘనాపూర్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ హాజరుకాగా మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, రూప్‌సింగ్, మాజీ ఉప సర్పంచులు సత్తయ్యగౌడ్, పరమేష్‌గౌడ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌సెట్ అధ్యాపకుడికి డాక్టరేట్



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాల అధ్యాపకుడికి పీహెచ్‌డీ పట్టా దక్కింది. కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న అబ్దుల్ సుభాని షేక్ సిల్వార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాము కుమార్ పర్యవేక్షణలో డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ రోబస్ట్ ఇమేజ్ హాషింగ్ స్కీమ్ ఫర్ ఇమేజ్ అథెంటికేషన్ అనే అంశంపై నిర్వహించిన పరిశోధనకుగాను సిల్వార్ యూనివర్సిటీ అబ్దుల్ సుభాని షేక్‌కు పీహెచ్‌డీ పట్టాతో పాటు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధికి కృషి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని నేతాజీనగర్, సాయిధరణి ఫేస్–2, గౌరి ఎంక్లేవ్‌లో సుమారు రూ. 22 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో స్థానిక వార్డు కౌన్సిలర్ సూచన మేరకు అభివృద్ధి పనుల కోసం నిధులను కేటాయించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ పాలక వర్గం సభ్యులు, అధికారుల సహకారంతో మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.

బాషపల్లి రమేష్‌చారికి విశ్వకర్మ లీడర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న రమేష్‌చారి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌కి చెందిన మేడ్చల్ జిల్లా విశ్వకర్మ సంఘం అధ్యక్షులు బాషపల్లి రమేష్‌చారి విశ్వకర్మ లీడర్ అవార్డు అందుకున్నారు. విశ్వకర్మలకు సేవా కార్యక్రమాల్లో ప్రత్యేక ప్రతిభ కనబర్చినందుకు న్యూఢిల్లీలోని అంబేద్కర్ భవన్‌లో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదనచారి, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకులు నీలందుల పుష్పగిరి చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మల్లు రవి, ఈటెల రాజేందర్, సెంట్రల్ మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి, గణేష్‌చారి, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు

మేడ్చల్: మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలో గల 44వ జాతీయ రహదారిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం వినియోగించే దరఖాస్తు ఫారాలు నిర్లక్ష్యంగా పడివుండటం చూసి ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ఫారాలు రోడ్డుపై దర్శనమివ్వడంతో మేడ్చల్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న మేడ్చల్ కమిషనర్ అక్కడికి చేరుకొని దరఖాస్తులను కార్యాలయానికి తరలించారు.


మేడ్చల్ 44వ జాతీయ రహదారి పక్కన పడిఉన్న సర్వే ఫారాలు